సాక్షి చిత్తూరు
శనివారం । 11 । ఫిబ్రవరి । 2023



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,150
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.72.00

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	17
తిరుపతి	34	18
తిరుమల	30	14
గూడూరు	34	19
నగరి	35	18



వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. శనివారం ఉదయం ధ్వజారోహణం నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

రాజీమార్గంలో చిట్ సమస్యలు



మాట్లాడుతున్న జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు

చిత్తూరు కార్పొరేషన్: రాజీమార్గంలో చిట్ సమస్యలను పరిష్కరించుకోవాలని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌శాఖ జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం చిట్‌ఫండ్ సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చిట్‌ఫండ్‌కు సంబంధించిన కేసులను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సేవల ద్వారా సమరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. చిట్‌ఫండ్ నిర్వాహకులు సాధ్యమైనంత వరకు వడ్డీ, పెనాల్టీలను తగ్గించి, కస్టమర్లతో సత్సంబంధాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పలు చిట్ ఫండ్ సంస్థల మేనేజర్లు, న్యాయ సలహాదారులు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయండి



డీఐజీ రవిప్రకాష్

చిత్తూరు అర్బన్: జాతీయ లోక్‌అదాలత్‌కు అందరూ సమన్వయంతో పనిచేయాలని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ తెలిపారు. చిత్తూరు, తిరుపతిజిల్లాలోని పోలీసు శాఖ అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. శనివారం నిర్వహించనున్న జాతీయలోక్ అదాలత్‌లో రాజీ మార్గానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రానున్న రోజుల్లో స్పెషల్ బ్రాంచి విభాగాలు మరింత చురుగ్గా పనిచేయాలన్నారు. ముందస్తు సమాచార సేకరణలో ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. అసాంఘిక కార్యక్రమాల కట్టడికి గట్టిగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాణిపాకంలో పెళ్లిళ్ల సందడి



ఆలయంలో నూతన వధూవరులు

కాణిపాకం(యాదమరి):కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో పెళ్లిళ్ల సందడి నెలకొంది. పెళ్లి ముహూర్తాలు ప్రారంభం కావడంతో శుక్రవారం కాణిపాకంలో వందకుపైగా పెళ్లిళ్లు జరిగాయి. దీంతో నూతన జంటలతో కాణిపాక ఆలయం కళకళలాడింది. స్వామివారి దర్శనార్థం నూతన వధూవరులు, వారి బంధువులతో క్యూలు కిటకిటలాడాయి. ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి చర్యలు తీసుకొని భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు.

13న ప్రధానమంత్రి అప్రెంటీస్ మేళా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 13 న ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రముఖ కంపెనీలలో ఖాళీలను భర్తీ చేసేందుకు ఈ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఉదయం 9 గంటల నుంచి జరిగే మేళాకు ఐటీఐ ఉత్తీర్ణత చెందిన అభ్యర్థులు హాజరుకావచ్చని చెప్పారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాలకు 9885195908, 8639020248ను సంప్రదించాలని కోరారు.

సబ్‌స్టేషన్లకు స్థలం కేటాయించండి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు అర్బన్ డివిజన్‌కు కొత్తగా రూ.6 కోట్లతో 3 విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. అందులో చిత్తూరు, గుడిపాల, జీడీనెల్లూరులో వీటిని ఏర్పాటు చేయనున్నారు. చిత్తూరు నియోజకవర్గంలో సబ్‌స్టేషన్ల ఏర్పాటు చేసేందుకు అవసరమైన స్థలం మంజూరు కోసం రెవెన్యూ అధికారులకు సిఫార్సు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులును ట్రాన్స్‌కో అధికారులు కోరారు. ఈ మేరకు ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై, డీఈ శేషాద్రి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులను ఆయన కార్యాలయంలో కలిసి మాట్లాడారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడతామని వారికి ఎమ్మెల్యే హామీనిచ్చారు.

విడిపోతున్న హీట్‌షీల్డ్



కొనసాగుతున్న రాకెట్ ప్రయాణం



జానుస్-1 ఉపగ్రహం, ఆజాదీ శాట్-2 ఉపగ్రహాన్ని విడిచిపెడుతూ..







షార్ కేంద్రంలోని మొదటి ప్రయోగవేదిక నుంచి నిప్పులు చిమ్ముతూ నింగివైపు దూసుకెళుతున్న ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్

గఘన విజయం!

ఇస్రో శాస్త్రవేత్తలు ఈ ఏడాది తొలి గ'ఘన' విజయాన్ని నమోదు చేశారు. శుక్రవారం షార్‌లో మొదటి ప్రయోగ వేదిక నుంచి స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. మూడు ఉపగ్రహాలను దిగ్విజయంగా సూర్య సమకాలిక కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. 119 టన్నుల బరువున్న ఉపగ్రహాలను నాలుగు దశల్లో మొత్తం 15.38 నిమిషాల్లో పూర్తి చేశారు. భూమికి అతి తక్కువ దూరంలోని 450 కిలోమీటర్ల ఎత్తులో ఉపగ్రహాలను ప్రవేశపెట్టి ఇస్రో అమ్ములపొదిలో మరో కొత్తరకం రాకెట్‌ను చేర్చారు.

- ఎస్ఎస్ఎల్‌వీ డీ2 ఉపగ్రహ ప్రయోగం విజయవంతం
- సూర్యసమకాలిక కక్ష్యలోకి మూడు ఉపగ్రహాలు
- ఇస్రో అమ్ములపొదిలో కొత్తరాకెట్ చేరిక
- ఇక వాణిజ్యపరమైన ప్రయోగాలవైపు దూసుకెళ్లనున్న షైనం

సూళ్లూరుపేట : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శాస్త్రవేత్తలు సరికొత్తగా దూసుకుపోతున్నారు. సూళ్లూరుపేట సమీపంలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో మొదటి ప్రయోగవేదిక నుంచి శుక్రవారం స్మాల్ శాటిలైట్ లాంచింగ్ వెహికల్ (ఎస్ఎస్ఎల్‌వీ డీ2) ప్రయోగాన్ని విజయవంతంగా పూర్తిచేశారు. వేకువజామున 2.18 కౌంట్‌డౌన్‌ను ప్రారంభించి ఉదయం 9.18 గంటలకు ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఇకపై ఇస్రో వాణిజ్యపరమైన ప్రయోగాల వైపు కూడా దూసుకెళ్లనుంది.

అత్యంత తక్కువ వ్యయం

అతి తక్కువ వ్యయంతో విదేశాలకు చెందిన బుల్లి ఉపగ్రహాలతో పాటుగా ఒక మోస్తరు బరువున్న ఉపగ్రహాలను, దేశ విదేశాల్లో ఉన్న ఐఐటీ విద్యార్థులు ప్రయోగాత్మకంగా తయారుచేసిన అతి బుల్లి ఉపగ్రహాలను పీఎస్ఎల్‌వీ రాకెట్‌లో ఉపయోగించారు. 2020లోనే ఈ ప్రయోగాన్ని నిర్వహించాలనుకున్నారు. కానీ ఆ సమయంలో కరోనా వల్ల ప్రయోగం ఆలస్యమైంది. చిన్న తరహా ఉపగ్రహాలను అత్యంత తక్కువ వ్యయంతో ప్రయోగించేందుకు ఈ స్మాల్ శాటిలైట్ లాంఛింగ్ వెహికల్‌ను డిజైన్ చేశారు. అయితే గత ఏడాది ఆగస్టు 7న ఎస్ఎస్ఎల్‌వీ డీ1 పేరుతో చేసిన ప్రయోగం విఫలమైనట్టుగా ఇస్రో ప్రకటించింది. ఆ ప్రయోగంలో జరిగిన పొరపాట్లును సరిచేసుకుని ఈ సారి అత్యంత అధునాతనమైన సాంకేతిక పరికరాలను రూపొందించుకుని ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్‌ను ప్రయోగించారు. ఇప్పటిదాకా ఎస్ఎల్‌వీ, ఏఎస్ఎల్‌వీ, పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ మార్క్3 రాకెట్లను మాత్రమే డిజైన్ చేశారు. సరికొత్తగా ఎస్ఎస్ఎల్‌వీ కూడా ఇస్రో జాబితాలో చేరింది.

శ్రీసిటీ ఎండీ అభినందనలు

వరదయ్యపాళెం: ఎస్ఎస్ఎల్వీ రాకెట్ రెండవ ప్రయోగం విజయవంతం కావడంతో శ్రీసిటీ వ్యవస్థాపక నిర్వాహక సంచాలకులు డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) చైర్మన్ కె.సోమనాథ్‌కు, షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్‌కు, ఇతర శాస్త్రవేత్తలకు ఆయన అభినందనలు తెలిపారు.

రాకెట్ ప్రయోగమిలా...

- ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్ 34 మీటర్లు పొడువు, 2 మీటర్లు వెడల్పు
- 119 టన్నుల బరువుతో నాలుగు దశల్లో 15.38 నిమిషాలకు ప్రయోగం పూర్తి.
- 87 టన్నుల ఘన ఇంధనాన్ని ఉపయోగించి సెకన్లకు మొదటి దశను పూర్తిచేశారు.
- 162.4 సెకన్లకు రాకెట్ శిఖరభాగాన ఉపగ్రహాలను అమర్చిన హీట్‌షీల్డ్ విడిపోయింది.
- 7.7 టన్నుల ఘన ఇంధనంతో 385.8 సెకన్లకు రెండోదశ పూర్తి.
- 4.5 టన్నుల ఘన ఇంధనంతో 675.1 సెకన్లకు మూడో దశ పూర్తి.
- నాలుగో దశలో వెలాసిటీ ట్రిమ్మింగ్ మోటార్‌లో నింపిన 0.05 టన్నుల ద్రవ ఇంధనం సాయంతో 683.7 సెకన్లకు కటాఫ్.
- తర్వాత 808.6 సెకన్లకు 156.3 కేజీల బరువు కలిగిన ఎర్త్ అబ్జర్వేషన్ ఉపగ్రహాన్ని భూమికి 450 కిలోమీటర్ల ఎత్తులోని లియోఆర్బిట్‌లోకి మొదటిగా ప్రవేశపెట్టారు.
- అంటారిస్ యూఎస్ఏకి చెందిన 10.2 కేజీల బరువు కలిగిన జానుస్ -1 అనే ఉపగ్రహాన్ని 903.6 సెకన్లకు ప్రవేశపెట్టారు.
- 8.7 కేజీల బరువు కలిగిన ఆజాదీశాట్ -2 అనే ఉపగ్రహాన్ని 923.6 సెకన్లకు అంటే 15.38 నిమిషాలకు భూమికి 450 కిలోమీటర్లు ఎత్తులోని లియో అర్బిట్ (సూర్య సమకాలిక కక్ష్య)లోకి ప్రవేశపెట్టారు.
- 900.1 సెకన్లకు ప్రయోగాన్ని పూర్తి చేయాలనుకున్నారు. కానీ అదనంగా 23 సెకన్లు తీసుకుని ఈ ప్రయోగాన్ని విజయవంతం చేశారు.
- కక్ష్యలోకి చేరుకున్న మూడు ఉపగ్రహాలు ఆరోగ్యకరంగా ఉన్నాయని ఇస్రో చైర్మన్ ఎస్ సోమనాథ్ ప్రకటించారు.
- షార్ నుంచి 85వ ప్రయోగం ఎస్ఎస్ఎల్‌వీ డీ2 రాకెట్.
- ఎస్ఎస్ఎల్‌వీ సిరీస్‌లో ఇది రెండో రాకెట్.
- ఈ ఏడాదికి ఇదే మొదటి రాకెట్.

దేవుడి దయతో చల్లగా ఉండాలి

- మహాగణపతి ఆలయ కుంభాభిషేకంలో మంత్రి పెద్దిరెడ్డి



మహాగణపతి ఆలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పలమనేరు: దేవుడి దయ, కరుణతో ప్రజలందరూ చల్లగా ఉండాలని రాష్ట్ర అటవీ, ఇంధన, గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పలమనేరు మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు ఇందిరమ్మ కాలనీలో టెర్రకోట హస్తకళాకారులు నిర్మించిన మహాగణపతి నూతన ఆలయ కుంభాభిషేకంలో భాగంగా ఆయన శాలివాహన చక్రవర్తి, మొల్ల విగ్రహాలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున తాను రాజకీయాలు మాట్లాడనని, కేవలం ఆలయ ప్రారంభోత్సవం చేశామని తెలిపారు. ఆలయం వద్ద పుణ్యాహం, బింబ అగ్నియోచనం, పంచగవ్యాధి వాస్తు క్షీరం, ప్రభూతబలి, శయణాధి వాసం తదితర కైంకర్యాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేగౌడ, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పట్టణ కన్వీనర్ జాఫర్, మున్సిపల్ వైస్ చైర్మన్లు చాన్బా కమాల్, కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ రాజేంద్రన్, ఆలయ నిర్వాహకులు, టెర్రకోట హస్తకళాకారుల సంఘ అధ్యక్ష, కార్యదర్శులు రామక్రిష్ణ, మోహన్, కుప్పం నియోజకవర్గ పరిశీలకులు మొగసాల రెడ్డెప్ప, పెద్దపంజాణి కన్వీనర్ బాగా రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోడిగుడ్డు కోసం కొట్టుకున్నారా..?

- అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలు ఏరీ?
- కేంద్రాన్ని మూసేయండి
- రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ఆదేశం




నాయని చెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విజయప్రతాప్‌రెడ్డి

చిత్తూరు రూరల్: 'కోడిగుడ్డు కోసం కొట్టుకున్నారా..ఎందుకమ్మా..ఇలా' అంటూ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి ప్రశ్నించారు. మండలంలోని తుమ్మింద హైస్కూల్‌లో శుక్రవారం మధ్యాహ్న భోజన నిర్వహణను ఆయన తనిఖీ చేశారు. అనంతరం నాయనిచెరువు అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. ఆ సమయంలో అక్కడ పిల్లలు ఒకరు కూడా లేరు. పిల్లలు లేకుండా కేంద్రం ఎలా నిర్వహిస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే అంగన్‌వాడీ కేంద్రాన్ని ఖాళీ చేయండి అంటూ ఆదేశించారు. ఆ కేంద్రంపై వచ్చిన ఫిర్యాదును అందరి సమక్షంలో చదివి వినిపించారు. అనంతరం రికార్డులో ఉన్న పిల్లల తల్లిదండ్రులను పిలిపించారు. వారు రెండు నెలలకు పైగా తమ పిల్లలు కేంద్రానికి రావడం లేదని, ఎలాంటి సరుకులూ ఇవ్వడం లేదన్నారు. ఆ తర్వాత కోడిగుడ్డు కోసం లబ్ధిదారులు, కేంద్ర నిర్వాహకులు కొట్టుకున్నారని చెప్పారు. దీంతో ఆయన అంగన్‌వాడీ వర్కర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కేంద్రం తొలగించి దగ్గరలో మినీ అంగన్‌వాడీ సెంటర్‌ను పెట్టించాలన్నారు. అనంతరం చెన్నసముద్రంలో రేషన్‌పంపిణీని పరిశీలించారు. డీఎస్‌ఓ శంకరన్, పౌరసరఫరాల సంస్థ మేనేజర్ మోహన్‌బాబు, ఎంఈఓ సెల్వరాజ్, సీడీపీఓ శ్యామసుగుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

కరోనా కనుమరుగు!

ప్రపంచాన్నే గడగడలాడించిన కరోనా కనుమరుగైనట్లేనా? మూడేళ్లపాటు నాలుగు దశల్లో లక్షలాది మందిని చుట్టుముట్టిన ఈ వైరస్ వేలాదిమందిని పొట్టనపెట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం వేలాది కోట్లు వెచ్చించి, చేపట్టిన నివాణ చర్యలు, అధికార యంత్రాంగం చేసిన నిర్విరామ కృషి కోవిడ్‌ను కట్టడి చేసింది. మొన్నటివరకు చైనాలో కోట్లాదిమందిని మంచమెక్కించిన ఈ మహమ్మారి జిల్లాలో మాత్రం దాని జాడ కూడా లేదు. టీకా పంపిణీని పకడ్బందీగా అమలు చేసిన జిల్లా యంత్రాంగం వైరస్‌ను నామ రూపాల్లేకుండా చేసింది.

- మూడేళ్లుగా జిల్లాను పట్టిపీడించిన కోవిడ్
- నాలుగు దశల్లో 2.80 లక్షల కేసులు
- మహమ్మారి కట్టడికి సర్కారు చర్యలు
- జిల్లాలో 2023 నుంచి జీరో



చిత్తూరు రూరల్: జిల్లాలో 2020 నుంచి 2023 వరకు 3 లక్షలకుపైగా కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తే 2.80 లక్షల కరోనా కేసులు నమోదయ్యాయి. నాలుగు దశల్లోనూ 2017 మంది మృతి చెందారు. 2020 మార్చి 26న యూకే నుంచి శ్రీకాళహస్తికి వచ్చిన ఓ వ్యక్తికి తొలి పాజిటివ్ కేసు నిర్ధారణ అయింది. వెంటనే జిల్లా అధికారులు నివారణ చర్యలు చేపట్టారు. వారితోపాటు, చుట్టుపక్కల వారికి కోవిడ్ పరీక్షలు చేసి ఆసుపత్రికి తరలించారు. ఆ వీధి మొత్తం బ్లీచింగ్ పిచికారీ చేయించారు. తరువాత ఆ ఇంటి పక్కన ఉన్న వ్యక్తులకు కూడా కోవిడ్‌పరీక్షలు చేశారు. అలా మొదలైన కేసులు చివరకు 2.80 లక్షల వరకు చేరాయి. తొలి దశలో పెద్దగా మరణాల సంఖ్య లేకపోయినా, రెండో దశలో మాత్రం ఆక్సిజన్ సమస్య ఏర్పడి చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. థర్డ్ వేవ్, ఫోర్త్‌వేవ్‌లో పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. దీంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ప్రభుత్వం ముందస్తు చర్యలతో కట్టడి

అప్పట్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తిరుపతి, చిత్తూరు, మదనపల్లె, నగిరి, శ్రీకాళహస్తి వంటి ప్రాంతాల్లోనే అత్యధికంగా కరోనా కేసులు కనిపించాయి. లక్షణాలు బయటపడితే వెంటనే వలంటీర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎం, సచివాలయ సిబ్బంది వారి వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపేవారు. ఆ తరువాత వారిని పరీక్షించి హోం ఐసోలేషన్‌లో ఉంచేవారు. అక్కడే బాధితులకు 14రోజులపాటు మందులు, ఆహారం ఉచితంగా అందించారు. తరువాత కేసులు పెరగడంతో ఫీవర్ సర్వేకు శ్రీకారం చుట్టారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చే వారిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టేవారు. ఇలా ఎప్పటికప్పుడు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కరోనా కష్ట కాలంలో పేద ప్రజలను ఆదుకోవడానికి ఇంటికి రూ.వెయ్యి చొప్పున ప్రభుత్వం నగదు సాయం అందించింది. ప్రతినెలా ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తూ వచ్చింది. లాక్‌డౌన్‌ను పకడ్బందీగా అమలు చేసింది.

టీకానే ఆయుధంగా...

కేసులు అదుపులోకి రాకపోవడం, మహమ్మారి జిల్లాను చుట్టేస్తున్న సమయంలో కోవిడ్ టీకా బలమైన ఆయుధంగా నిలిచింది. కోవిడ్ వచ్చిన ఏడాది తరువాత టీకాలు అమలులోకి వచ్చాయి. తొలుత ఫ్రంట్‌లైన్ వర్కర్లకు టీకా వేయించారు. ముందుగా ఈ టీకా వేసుకునేందుకు జనం కాస్త విముఖత చూపించారు. వెంటనే ప్రభుత్వం అవగాహన కల్పించి టీకాను పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంది. తొలుత కొన్ని చోట్ల మాత్రమే వ్యాక్సినేషన్ అందించారు. ఆ తర్వాత ప్రత్యేక వ్యాక్సిన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మళ్లీ మిగిలిన వాళ్లకు ఇంటి వద్దకే వెళ్లి వ్యాక్సినేషన్ వేశారు. ఈ ఫలితంగా వ్యాక్సిన్ అమలు వంద శాతం పూర్తయింది. అధికశాతం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వ్యాక్సినేషన్ వేసుకున్నారు. ఈ విధివిధానాలతో పూర్తి స్థాయిలో కోవిడ్ వ్యాప్తిని అధిగమించగలిగారు. 2022 డిసెంబర్ 30 తేదీతో జీరో కేసులు చేశారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు కూడా జిల్లాలో ఒక్క కేసు నమోదు కాలేదు.

సమష్టి కృషితోనే కట్టడి



జిల్లాలో కోవిడ్ నివారణకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పనిచేస్తున్నారు. ఏ రాష్ట్రంలోనూ లేనివిధంగా మన రాష్ట్రంలో ప్రభుత్వం ఈ మహమ్మారి కట్టడికి భారీ స్థాయిలో నిధులు వెచ్చించి, పకడ్బందీగా చర్యలు తీసుకుంది. క్షేత్ర స్థాయిలో సర్వేను పక్కాగా చేపట్టింది. బయటి నుంచి వచ్చే వ్యక్తులను పసిగట్టింది. దీంతోపాటు కోవిడ్ కట్టడికి వ్యాక్సినేషన్ కీలకమైంది. ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, పూర్తి స్థాయిలో టీకా పంపిణీని విజయవంతంగా చేశాం.

-రవిరాజు, డీఐఓ

టీకా వివరాలు



మొత్తం డోస్‌లు	-	95,49,048
ఫస్ట్‌డోస్ వేసుకున్నవారు	-	38,39,063
సెంకడ్ డోస్	-	41,55,003
ప్రికాషన్‌డోస్	-	15,54,982

	కోవిడ్ పరీక్షలు	పాజిటివ్‌కేసులు	మృతులు
ఫస్ట్‌వేవ్	1154981	89921	858
సెంకడ్	2260913	164296	1115
థర్డ్	152105	23568	43
ఫోర్త్	9564	436	1

క్లుప్తంగా

మహిళలకు ఉచిత శిక్షణ

చంద్రగిరి: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు ఉపాధి అవకాశం కల్పించేందుకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఆంధ్రాబ్యాంకు గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 14 నుంచి 30 రోజుల పాటు మహిళలకు ఆర్యవర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన తెల్లరేషన్ కార్డు కలిగి, 19 నుంచి 40 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు అర్హులని పేర్కొన్నారు. కనీసం అర్హత 10వ తరగతి ఉండాలని సూచించారు. శిక్షణ సమయంలో ట్రైనీస్‌కు ఉచిత భోజనం, రానుపోను ఒక్కసారి చార్జీలు ఇవ్వనున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి ధ్రువపత్రాలను అందజేస్తామ తెలిపారు. ఆసక్తిగల వారు ఆధార్, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో నేరుగా సంస్థకు వచ్చి వారి పేరును నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు యూనియన్ బ్యాంక్ గ్రామీణాభివృద్ధి సంస్థ, ద్వారకానగర్, చంద్రగిరి. ఫోన్ 79896 80587, 94949 51289, 63017 17672 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

అంతర పంట..
అదనపు ఆదాయం

- మామిడి తోటల్లో అంతర పంటల సాగు
- ఒకే భూమిలో ఏక కాలంలో రెండు, మూడు పంటలు
- భారీగా తగ్గనున్న పంట పెట్టుబడి, కూలీల ఖర్చులు

పలమనేరు: సాధారణంగా రైతులు ఓ పంట కాలంలో ఒక పంటను మాత్రమే సాగుచేయడం సాధారణం. కానీ ఏక కాలంలోఒకే భూమిలో రెండు మూడు పంటలను సాగుచేయడంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అంతర పంటల సాగుతో ఓ పంటలో నష్టం వచ్చినా మరోపంట రైతును ఆదుకుంటోంది. దీంతోపాటు అదనపు ఆదాయం వస్తోంది. మామిడి తోటలున్న రైతులు ఏడాదికోమారు తోటను విక్రయించి ఆదాయం పొందేవారు. ఇప్పుడు రైతులు కాస్త విభిన్నంగా ఆలోచిస్తున్నారు. మామిడి తోటలోనే ఏడాదికి మూడు రకాల పంటలను పండిస్తూ ఏడాదికొచ్చే మామిడి ఆదాయంతో పాటు అంతకు మూడు రెట్ల ఆదాయాన్ని గడిస్తున్నారు.

మామిడి రైతులకెంతో మేలు

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి విస్తీర్ణం 2.60 లక్షల ఎకరాలుగా ఉంది. ఇందులో నీటి సౌకర్యం ఉన్న తోటలు 80వేల ఎకరాలు. గత మూడేళ్లుగా మామిడి తోటల్లో ఇతర పంటల సాగు క్రమేణా విస్తరిస్తోంది. ప్రస్తుతం 40 వేల ఎకరాల్లో ఇతర పంటలు సాగుచేస్తున్నట్లు ఉద్యానవన శాఖ తెలిపింది. ఏటా మామిడి ఫలసాయంతోపాటు అంతరపంటల కారణంగా రెట్టింపు ఆదాయం గ్యారెంటీగా దక్కుతుంది. రైతులు మామిడిలో అంతర పంటలుగా బీన్సు, టమాటా, వంగ, బెండ, పసుపు, మిరప లాంటి అంతరపంటలను పండిస్తున్నారు. అలసంద, జీనుగ, పెసర, మునగతో పాటు తక్కువ వ్యవధి పంటలైన ఆకుకూరలను సాగుచేస్తున్నారు.

సాగవుతున్న అంతరపంటలు

బొప్పాయి తోటలో బీన్సు, కొత్తిమీర, ధనియాలు, వెల్లుల్లి, మిరపలో అరటి, టమాటాలో కాకర, దోస, తీగబీన్సు, బీర తదితర పంటలను సాగుచేస్తున్నారు. బంతిపూలలో దోస, కొత్తిమీర, బెండ, బీన్సు, టమాటా, వంగతోటలో బంతి, టమాటలో కాకర లాంటి కాంబినేషన్లు రైతులకు లాభసాటిగా మారాయి. కొందరు రైతులు బొప్పాయిలో బంతి, మిరపలో అరటి, బంతిలో అలసంద, క్యాబేజిలో వెల్లుల్లి, కొత్తిమీర సాలుపంటగా జొన్నలను పండిస్తున్నారు.


కుర్మాయి వద్ద బొప్పాయిలో అంతరపంటగా సాగు చేసిన బంతి

ఈ విధానాలతో బహుళ లాభాలు

పంట సాగుకు అవసరమైన భూసారానికి సేంద్రీయ ఎరువులు, నీటివినియోగం, కూలీలు, క్రిమిసంహారకమందుల ఖర్చు భారీగా తగ్గుతుంది. ముఖ్యంగా పంటకాలం ఆదా అవుతుంది. కాబట్టి ఏటా మూడు పంటల్లో రెండు, మూడు పంటలను మిశ్రమ, అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చు. దీంతో ఓ పంటకు ధర తగ్గినా మరో రెండు పంటలకు ధరలుండే అవకాశం ఉంటుంది. ఫలితంగా రైతుకు నష్టాలు వచ్చే అవకాశముండదు.

టమాటా రైతులకు ఇదోవరం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో టమాటా ఎక్కువగా సాగవుతోంది. అయితే టమాటా ధరలు ఎప్పుడూ నిలకడగా ఉండవు. ఎకరా పొలంలో టమాటాను సాగుచేసేందుకు దాదాపు రూ.80వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. పంట దిగుబడి మధ్యలో ఉన్నప్పుడు ఇదే పొలంలో తీగపంటలైన బీన్సు, బీర, కాకర, సొర లాంటి పంటలను సాగుచేస్తే టమాటా పంట అయిపోగానే, అదే కర్రలకు రెండో పంట తీగలను పెట్టుకోవచ్చు. ఫలితంగా పంట పెట్టుబడి తగ్గడంతో పాటు భూమిని కొత్త పంటకు సిద్ధం చేసే ఖర్చు కూడా తగ్గుతుంది. టమాటా ధర లేనప్పుడు, రెండో పంట ఆసరాగా ఉంటుంది.


చింతలగుంట వద్దమామిడిలో అంతరపంటగా సాగు చేస్తున్న బీన్స్


బైరెడ్డిపల్లి వద్ద క్యాబేజి పంటలో వెల్లుల్లి, ధనియాలు సాగుచేసిన దృశ్యం

కూరగాయల పంటలతో లాభం



గతంలో ఒకే పంటను సాగుచేయడంతో నష్టం వస్తే ఇబ్బంది పడేవాళ్లం. అందుకని మామిడి తోపులో రకరకాల కూరగాయలతో పాటు బంతి, చామంతి లాంటి తక్కువ పంటకాలం ఉన్నవాటిని సాగుచేస్తున్నాం. దీంతో మామిడి ఆదాయంతోపాటు రెండు, మూడు పంటల ఆదాయం కలిసివస్తుంది. ముఖ్యంగా అన్ని పంటలకు అవే నీరు, అంతే ఎరువులు, కూలీల బాధ చాలా వరకు తగ్గింది.

– మోహనరెడ్డి, చింతలగుంట, బైరెడ్డిపల్లి మండలం

పెట్టుబడి చాలా తగ్గుతుంది



నేను గత నాలుగైదేళ్లుగా రెండు, మూడు అంతరపంటలను సాగుచేస్తున్నా. దీంతో భూమిని దున్నే ఖర్చు, బోదెలు, మల్చింగ్‌షీట్ ఒకేసారి మూడు పంటలకు పనికొస్తుంది. ఎరువులు కూడా మిగులుతాయి. పండించిన పంట ధరలు తగ్గినా పంట పెట్టుబడి ఆదా అయితే రైతుకు నష్టం రాదు.

– మునివెంకటరెడ్డి, కుర్మాయి, పలమనేరు మండలం

నూతన పద్ధతులతో ముందుకెళ్లాలి



అంతరపంటలుగా కూరగాయలు, పూలు సాగుచేసినా భూమిలో అదే సత్తువ సరిపోతుంది. రెండు, మూడు రకాల పంటలున్నప్పుడు రైతులకు ఖచ్చితంగా ఏదో పంట ఆదుకుంటుంది. పంటలను తక్కువ ఖర్చుతో సాగుచేస్తూ నాలుగురకాల ఆదాయాన్ని పొందవచ్చు. ఇప్పుడు రైతులు విభిన్నంగా ఆలోచించడం మంచి పరిణామం.

– డా.కోటేశ్వరరావు, ఏడీ, హార్టికల్చర్, పలమనేరు

సాక్షి క్లాసిఫైడ్స్

వైభవంగా ముగిసిన లక్షకుంకుమార్చన



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న దంపతులు , విశేష అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో ఏటా మాఘమాసంలో అత్యంత వైభవంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన పూజలు శుక్రవారంతో వైభవంగా ముగిశాయి. వేద పండితులు, అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ కమిటీ చైర్మన్ మిద్దెంటి శంకర్‌నారాయణ, ఈఓ చంద్రమౌళి ఆధ్వర్యంలో అమ్మవారి ఉత్సవ మూర్తికు ప్రత్యేక పూజలు చేసి దంపతులకు పూజా సామగ్రిని అందజేశారు. అమ్మవారి ఉత్సవమూర్తి ఎదుట ప్రత్యేక పూజలు, గణపతి, చండీహోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి ఇచ్చారు. అంతకుమునుపే రూ:1116 చెల్లించిన ఉభయదారులు పూజలు చేశారు. సుమారు 205 జంటలు కుంకుమార్చన పూజల్లో పాల్గొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోయకొండ కిటకిటలాడింది. పూజా కార్యక్రమాల అనంతరం ఉభయదారులకు తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారికి ప్రతి శుక్రవారం నిర్వహించే రాహుకాల అభిషేక పూజలను భక్తిశ్రద్ధలతో చేపట్టారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు వెంకటరమణారెడ్డి, పూర్ణిమ, శ్రావణి, ఈశ్వరమ్మ తదితరులున్నారు.

‘వినరో భాగ్యం విష్ణు కథ’ను ఆదరించరూ!


సమావేశంలో మాట్లాడుతున్న తేజ

చిత్తూరు రూరల్: చిత్తూరు ప్రజానీకం మాట్లాడే యాసతో గతంలో విడుదల అయిన ఎస్.ఆర్. కల్యాణమండపం చిత్రాన్ని పెద్ద మనస్సు ఆదరించారని... ఇదే తరహాలో గీతం ఆర్ట్స్ ప్రొడక్షన్ వారు నిర్మించిన ‘వినరో భాగ్యం విష్ణు కథ’ ఈ నెల 17న విడుదల కానుందని... ఈ చిత్రాన్ని ప్రేక్షక దేవుళ్ల పెద్ద మనస్సుతో ఆదరించాలని చిత్తూరు జిల్లాకు చెందిన తేజ కోరారు. శుక్రవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అతను మాట్లాడాడు. ఈ చిత్రంలో తాను హీరో కిరణ్ అబ్బవరం స్నేహితుడిగా నటించానన్నాడు. హాస్యం, యాక్షన్‌తో రూపొందిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరిస్తుందని పేర్కొన్నారు. తనది కాణిపాకం దగ్గర పుత్రమద్ది గ్రామమని .. కరోనా కాలంలో యూట్యూబ్ ద్వారా ‘చిత్తూరు కుర్రోడు’ పేరుతో చిత్తూరు యాసతో పలు షార్ట్ ఫిల్మ్‌లు చేశానన్నారు. ఈ నేపథ్యంలో ఈనెల 17న శివరాత్రి రోజున విడుదల కానున్న సినిమాను అందరూ ఆదరించాలని కోరారు. సమావేశంలో అసిస్టెంట్ డీటీపీఎం రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు లేని ఇరవై ఆటోలు సీజ్

పలమనేరు: నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న ఇరవై ఆటోలను పోలీసులు శుక్రవారం సీజ్ చేసినట్టు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. వాహనాల తనిఖీ చేస్తుండగా, రికార్డులు సక్రమంగా లేని, రికార్డులు లేని ఆటోలను సీజ్ చేశామని తెలిపారు. అదే సమయంలో పట్టణ సమీపంలోని నాగమమంగళం వద్ద వెనుకవైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఢీకొని బైక్‌పై వస్తున్న పలమనేరుకు చెందిన బాలాజీ(20) గాయపడినట్టు పోలీసులు తెలిపారు.

కౌంటింగ్ కేంద్రాల పరిశీలన


సమావేశంలో మాట్లాడుతున్న జేసీ వెంకటేశ్వర్

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాటు చేయనున్న కేంద్రాలను జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ పరిశీలించారు. ఆయన శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు కేంద్రాలను పర్యవేక్షించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం పకడ్బందీగా ఎన్నికల కసరత్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మార్చి 13న నిర్వహించే ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సన్నద్ధమవుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని కొంగారెడ్డిపల్లిలో ఇండస్ట్రియల్ ఎస్టేట్ వద్ద ఉన్న భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) గోడౌన్, ఆర్‌వీఎస్, అపోలో ఇంజినీరింగ్ కళాశాలల్లో కౌంటింగ్ నిర్వహణకు పరిశీలించామన్నారు. ప్రకాశం -నెల్లూరు-చిత్తూరు గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు, స్థానిక సంస్థల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీఆర్‌వో రాజశేఖర్, ఆర్‌డీవో రేణుక, చిత్తూరు తహసీల్దార్ పార్వతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్ట రీత్యా నేరం

చిత్తూరు కలెక్టరేట్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్ట రీత్యా నేరమని, ఈ చట్టాన్ని అతిక్రమించే వారి పై చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా మల్టీ మెంబరు అప్రోప్రియేట్ అథారిటీ మరియు జిల్లా అడ్వయిజరీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశంలో జేసీ మాట్లాడుతూ జిల్లాలో నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయాలని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా క్షేత్ర స్థాయిలో బాల్యవివాహాలు నిర్మూలనకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హరినాథరెడ్డి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

టేకు దుంగలు స్వాధీనం: నలుగురి అరెస్ట్



పట్టుబడిన దుంగలు, నిందితులను చూపుతున్న డీఎస్పీ రామరాజు, పోలీసులు

వడమాలపేట: అక్రమంగా తరలిస్తున్న టేకు దుంగలను స్వాధీనం చేసుకొని నలుగురిని అరెస్ట్ చేసినట్లు పుత్తూరు డీఎస్పీ రామరాజు తెలిపారు. ఆయన శుక్రవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలంలోని ఎస్‌బీఆర్ పురం వెళ్లే రోడ్డు వద్ద గురువారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా ట్రాక్టర్‌లో సుమారు రూ.45 వేల 8 టేకు దుంగలు అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. పారిపోవడానికి ప్రయత్నించిన నిందితులు ఎస్‌బీఆర్ పురానికి చెందిన మనోహర్, నాగరాజు (38), ఈశ్వరయ్య (52), హరి (36)ని పట్టుకున్నారు. వారిని విచారించగా ఈ దుంగలు అదే గ్రామానికి చెందిన వెంకటతేజ తోటలో నరికినట్లు తేలింది. ట్రాక్టర్‌తో సహా నిందితులను అదుపులోనికి తీసుకున్నారు. పుత్తూరు ఏడీఎం కోర్టులో శుక్రవారం హాజరు పరిచగా రిమాండ్ విధించినట్లు వివరించారు. సమావేశంలో పుత్తూరు రూరల్ సీఐ సురేష్ కుమార్, వడమాలపేట ఎస్‌ఐ రామాంజనేయులు పాల్గొన్నారు. నిందితుల అరెస్టులో ప్రతిభ చూపిన హెడ్ కానిస్టేబుల్ మురళి, సర్కిల్ ఐడీ పార్టీ పీసీ ఉదయగిరిని అభినందించారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం


సీఎం జగన్, మంత్రి పెద్దిరెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న నాయీ బ్రాహ్మణులు

రొంపిచెర్ల: ఆలయ పాలక వర్గాల్లో నాయీ బ్రాహ్మణులకు చోటు కల్పించడంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు చిన్న నాగరాజ మాట్లాడుతూ ఆలయ పాలక వర్గాల్లో నాయీ బ్రాహ్మణులను నియమించేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణుల సంఘం నాయకులు యండపల్లె మునీంద్ర, జ్ఞానమూర్తి, రెడ్డిప్రసాద్, రమేష్, చిన్న రెడ్డెప్ప, వెంకటరమణ, మునిరామయ్య, రాజన్న, వై.చిన్న రమణ, కె.మోహన్, మునికృష్ణ, మనోహర్, వెంకటముని తదితరులు పాల్గొన్నారు.

20 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

- సమన్వయ కమిటీ సమావేశంలో డీఆర్‌వో రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలను ఈ నెల 20 నుంచి నిర్వహించనున్నట్లు డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. కలెక్టరేట్‌లో ఆయన శుక్రవారం ప్రాక్టికల్స్‌పై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. డీఆర్‌వో మాట్లాడుతూ జిల్లాలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 4 వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ థియరీ పరీక్షలుంటాయని చెప్పారు. దీనికి ముందుగా ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ఈనెల 20 నుంచి మార్చి 7 వరకు ఒకేషనల్ కోర్సుల ప్రాక్టికల్స్, ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఒకేషనల్ కోర్సులకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో 7,079 మంది విద్యార్థులకు 58 కళాశాలల్లో ప్రాక్టికల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సీనియర్ ఇంటర్‌లో 25031 మంది విద్యార్థులకు 240 కళాశాలల్లో ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని ఆర్‌ఐఓ రమేష్ వివరించారు. ఈ సమావేశంలో డీఈఓ విజయేంద్ర రావు, డీవిఈవో దయానంద రాజు, ట్రాన్స్‌కో డీఈ శేషాద్రి రెడ్డి, ఇతర సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లా కోసం...

డ్రగ్స్ రహిత జిల్లా కోసం కృషి చేద్దామని డీఆర్‌వో ఎన్.రాజశేఖర్ పిలుపునిచ్చారు. డీఆర్వో చాంబర్లో శుక్రవారం ఆయన, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డితో సమన్వయ సమావేశం నిర్వహించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఆధ్వర్యంలో విద్యాశాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఇతర అధికారులతో కలిసి డ్రగ్స్ రహిత సమాజంపై చర్చించారు. డీఆర్వో మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో విద్యార్థులపై యాజమాన్యం పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. డ్రగ్స్ తీసుకోవడం వల్ల కలిగే దుష్ఫలితాలపై బ్యానర్లు, పోస్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై ఎటువంటి సమాచారమైనా 14500కు అందించాలని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్‌ఎఫ్‌ఓ మదన్ మోహన్ రావ్, ఐసీడీఎస్ పీడీ నాగ శైలజ, సోషల్ వెల్ఫేర్ డీడీ రాజేశ్వరి, డీపీఈవో దయాసాగర్, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ కీర్తన పాల్గొన్నారు


డీఆర్‌వో రాజశేఖర్

వెట్టి నుంచి విముక్తి

వెట్టి చాకిరీలో చిక్కుకున్న వారిని గుర్తించి విముక్తి కల్పించడం ధ్యేయంగా కార్మిక శాఖ పని చేయాలని డీఆర్‌వో రాజశేఖర్ తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఈ నెల 9 నుంచి 15 వరకు ×ఆపరేషన్ స్వేచ్ఛ ₹ అనే పేరుతో వారోత్సవాలు నిర్వ హించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖలు ఒక బృందంగా ఏర్పడి వెట్టి చాకిరి నిర్మూలన చట్టం అమలుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. వెట్టిచాకిరికి పాల్పడితే 1976 ప్రకారం జైలు శిక్ష, జరిమానా విధిస్తారని తెలిపారు. ఈ సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ అధికారి, సహాయ కార్మిక కమిషనర్ ఓంకార్ రావు, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పోలీస్, పరిశ్రమలు, విద్యా శాఖల సంబంధిత అధికారులు పాల్గొన్నారు.